డ్రైనేజీలకు మహర్దశ

- 45, 42 వార్డుల్లో డ్రైనేజీల ఆధునికీకరణ
- దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో దశాబ్ద కాలం నాటి డ్రైనేజీల సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులోని గణేష్‌నగర్, చిట్టిబాబు కాలనీ, సంతోషిమాత కాలనీ, ప్రశాంతినగర్, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ వంటి ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీలను ఆధునీకరించారు. సుమారు రూ.95 లక్షలను డ్రైనేజీ పనులకు వెచ్చించారు. సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, వరాహగిరి కాలనీ–1 వంటి ప్రాంతాల్లోని పాత డ్రైనేజీల అభివృద్ధి విషయమై వార్డు కార్పొరేటర్ కంపా హనోకు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. ప్రాధాన్యతా క్రమంలో ఈ పనులను పూర్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో పాత వాటి స్థానంలో మరింత విశాలంగా, లోతైన, వెడల్పాటి డ్రైనేజీలను నిర్మించారు. గతంలో కొన్ని ప్రాంతంలో వర్షాలు పడితే డ్రైనేజీలు నిండి, పొంగి ఇళ్లలోకి మురుగునీరు చేరేది. డ్రైనేజీల ఆధునికీకరణతో ఈ సమస్య తీరిపోయింది. చాలా కాలంగా డ్రైనేజీలతో అనేక ఇబ్బందులు పడిన స్థానికులు ఈ పనులు పూర్తి కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.39 కోట్లతో..

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ, జగన్నాథపురం, మసీదు వీధి ప్రాంతాల్లో సుమారు రూ.1.39 కోట్లతో డ్రైనేజీలను ఆధునికీకరించారు. ఇక్కడ సుమారు పదేళ్ల కిందట నాటి డ్రైనేజీ వ్యవస్థతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ చొరవతో పాత డ్రైనేజీలను అభివృద్ధి చేసి ప్రజల సమస్యను తీర్చారు.



రైల్వే న్యూకాలనీలో ఆధునికీకరించిన డ్రైనేజీ



సత్యసాయినగర్‌లో నిర్మించిన డ్రైనేజీ

ఇబ్బందులు తొలగించారు



రైల్వే న్యూకాలనీలో కొన్నేళ్లుగా పాత డ్రైనేజీలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అంచెలంచెలుగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశారు. డ్రైనేజీలను ఆధునికీకరించి మా సమస్యను పరిష్కరించారు.

– గాలి ప్రసాద్, రైల్వే న్యూకాలనీ

డ్రైనేజీలు బాగున్నాయి



సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లోని డ్రైనేజీలతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. చినుకు పడితే డ్రైనేజీలు పొంగి ఇళ్లలోకి మురుగు నీరు ప్రవహించేది. ఈ ప్రాంతాల్లోని డ్రైనేజీలు పదేళ్ల కిందట నిర్మించినవి. ఇటీవల వాటిని ఆధునికీకరించారు. – కారుకొండ రాజుయాదవ్, సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు

జోన్–2లో కార్డన్ సెర్చ్



బర్మాక్యాంప్‌లో కార్డన్ సెర్చ్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీసీపీ మేక సత్తిబాబు

మల్కాపురం: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పలు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు జోన్–2 పరిధిలో డీసీపీ మేక సత్తిబాబు, వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్, ఏఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నడుపుతున్న ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేసి భారీగా 70 మద్యం సీసాలు, 15 లీటర్లు కలిగిన మూడు డీజిల్ సీసాలు, 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా డీసీపీ మేక సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జోన్–2 పరిధిలోని మూడు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌లు చేపట్టినట్టు తెలిపారు. ఈ సెర్చ్‌లో భాగంగా లూస్ పెట్రోల్, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్‌ఐలు రవికుమార్, సమీర్, ఏఎస్‌ఐలు సతీష్, అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. బర్మాక్యాంప్ సమీపంలోని నూకాలమ్మ ఆలయం వద్ద ఇటీవల మహిళపై జరిగిన దాడి నేపథ్యంలో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

అన్నదానం గొప్పది



ధ్యాన మందిర అన్నదానంలో పాల్గొన్న గొండు సీతారాం దంపతులు

తాటిచెట్లపాలెం: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారం అన్నారు. వైశాఖి పౌర్ణమి సందర్భంగా గురువారం రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని సీతారాం దంపతులు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ముందుగా వారు ధ్యాన మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కొన్నేళ్లుగా ధ్యాన మందిరంలో అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో నిత్యం అన్నదానం, మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని, మందిర కమిటీ సభ్యులను అభినందించారు. సుమారు 400 మందికి ప్రత్యేక వంటకాలతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

డాబాగార్డెన్స్: టీపీటీ కాలనీ వద్ద గల పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున శుక్రవారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14వ వార్డు పరిధిలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, 16వ వార్డు పరిధి కేఆర్ఎంకాలనీ, భానునగర్, 24వ వార్డు పరిధి టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా మంచినీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేయనుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం జరిగింది. ఆలయ అర్చకుడు ఏడిద గురునాథ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.


వైభవుడికి పంచామృతాభిషేకం



సర్వాంగ వజ్రకవచధారుడిగా వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం వైభవుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, ఉదయాస్తమాన సేవలు చేశారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృతంతో వైభవుడిని అభిషేకించారు. స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మరమ్మతులకు నోచుకోని మండపం



వివేకానంద కల్యాణ మండపం వద్ద శిథిలమైన ప్రవేశ మార్గం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం మరమ్మతులకు నోచుకోవడం లేదు. మండపంలోకి వెళ్లే ప్రవేశ మార్గంలో సిమెంట్ పలకలు పూర్తిగా విరిగిపోయాయి. అక్కడే శానిటరీ కార్యాలయం ఉండటంతో ఉద్యోగులు రాకపోకల సమయంలో ఇబ్బంది పడుతున్నారు. కల్యాణ మండపంలో శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరిగే సమయంలో అక్కడికి వచ్చిన వారు గోతుల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా బీసీజీ వ్యాక్సినేషన్



వృద్ధురాలికి బీసీజీ టీకా వేస్తున్న ఏఎన్ఎం



గర్భిణికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్స్ అందజేస్తున్న ఏఎన్ఎం, ఆశా వర్కర్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 60 ఏళ్ల వయసు దాటిన వారికి క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేశారు. గర్భిణులకు బలం చేకూరడానికి, రక్తం వృద్ధికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ వర్కర్ భవానీ మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు పలు సూచనలిచ్చారు.

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం



బోసిపోయిన బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డు

సీతమ్మధార: సూర్యుడి ప్రతాపంతో సీతమ్మధారలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎల్లప్పుడూ బిజీగా ఉండే బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్, రాధకృష్ణా లేఅవుట్ రహదారులు గురువారం ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎండ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో రోడ్లుపై ఒక్క మనిషి కూడా కనిపించడం లేదు. ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్లు బోసిపోయాయి. ఎండ తీవ్రంగా ఉండటంతో ఇళ్ల నుంచి ఉదయం జనం బయటకు వచ్చి పది గంటలకే పనులు ముగించుకుని తిరిగి వెళ్లిపోయారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్స్‌పై నిర్వహిస్తున్న నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్–1(ఆపరేషన్) ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కైలాసపురం మెయిన్ రోడ్, కస్తూరినగర్, మధుసూదన నగర్, దుర్గా కైలాష్‌నగర్, నరసింహనగర్ రైతుబజార్, విద్యుత్‌నగర్, కిరణ్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాపురం సెక్షన్‌లో..

మురళీనగర్: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ మల్కాపురం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్‌ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అరుంధతి నగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు, ఏఎస్సార్ నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్‌రామ్‌నగర్, జగ్జీవన్ నగర్, అంబేడ్కర్ నగర్, ఇందిరానగర్ 1–5 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి, సహకరించాలని అధికారులు కోరారు.

విశేషంగా గురుదత్త సాయి మందిర వార్షికోత్సవం



శ్రీసాయి అష్టలక్ష్మి యాగంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన శ్రీకంఠ గురుదత్త సాయి ఆలయ 17వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. సాయినాథుడికి విశేష అభిషేకం, అనంతరం బంగారు కిరీట ధారణతో పట్టువస్త్రాలు, పూల దండలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పండితుల వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా శ్రీ సాయి అష్టలక్ష్మి యాగం నిర్వహించారు. దీని కోసం ఏర్పాటు చేసిన ఎనిమిది హోమ గుండాల వద్ద 28 మంది దంపతులు పాల్గొని హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

1న హనుమాన్ జయంతి



సీతమ్మధార కొండవాలులో 108 అడుగుల అభయాంజనేయ స్వామి

సీతమ్మధార: జూన్ 1న సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యా హవచనం, వాస్తు పూజ, అస్త్రరాజార్చన, మహన్యాస పూర్వక మన్యుసూక్త పంచామృతభిషేకం, దశ సహస్ర సింధూర్చన, దశ సహస్ర నాగవల్లిదళ పూజలు, నీరాజన మంత్ర పుష్పములు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో మల్లిడి చక్రవర్తి, లక్ష్మి దంపతుల సౌజన్యంతో ప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో..

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. 1వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆంజనేయ స్వామికి మన్యు సూక్త హోమం జరుపుతున్నట్లు చెప్పారు. పూర్ణాహుతి అనంతరం ఆంజనేయ స్వామికి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు సింధూర, ఆకు పూజలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



బుద్ధుడి పూజల్లో పాల్గొన్న బౌద్ధ కేంద్ర సమాజం సభ్యులు, మహిళలు



బుద్ధుడి విగ్రహానికి పూజలు చేస్తున్న మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు



లలితా పీఠంలో రమా సత్యనారాయణ స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం నియోజకవర్గంలో బుద్ధుడికి పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని బుద్ధ విహార్‌లో బుద్ధ పౌర్ణమి ఘనంగా జరిగింది. ఉపాసకుడు నల్లా గంగాధర్, అంబేడ్కర్ భవన్ కార్యవర్గ సభ్యులు జె.వి.ప్రభాకర్, జి.సత్యనారాయణ, ధర్మరాజు, కె.వెంకటరావు తదితరులు బుద్ధ విగ్రహానికి పూలమాలలతో అలంకరించి, బుద్ధ వందనం చేశారు. గంగాధర్ మాట్లాడుతూ బుద్ధుడి జననం నుంచి జ్ఞానోదయం, మహా పరినిర్వాణం వరకు వివిధ దశల్లో దమ్మ వ్యాప్తికి చేసిన కృషిని వివరించారు. బౌద్ధ గ్రంథాల గురించి వివరించారు.

లలితా పీఠంలో విశేష పూజలు

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం రమాసత్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ, హారతి ఇచ్చారు. మణిద్వీపంలో శ్రీచక్ర నవావరణ, లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ జరిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో రాజశ్యామల హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో హోమం చేశారు. పలువురు భక్తులు పూజా కార్యక్రమాలు, హోమంలో పాల్గొన్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బౌద్ధాలయంలో బుద్ధుడికి పూజలు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కోన వెంకటరావు ఉపాసకుడిగా వ్యవహరించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలకు చీరలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, సూర్యారావు, జి.రాజు, భీమారావు, పి.అప్పారావు, సునీల్, బర్మాక్యాంప్ సభ్యులు పాల్గొన్నారు.

బర్మాక్యాంప్ బౌద్ధాలయంలో..

బర్మాక్యాంప్ బౌద్ధాలయంలో జిల్లా మహా బోధి సొసైటీ, గ్రామాధ్యక్షులు, బౌద్ధాలయ నిర్వాహకుడు సాకేటి రవి ఆధ్వర్యంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు, బౌద్ధ ఉపాసకుడు జి.బాబులు పంచశీలా పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథి బర్మా ఆంధ్రా కాందిశీకులు, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి గునుపూడి అరుణ్‌బాబు బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమన్నారు. కార్యక్రమంలో ధరణ సత్యనారయణ, మట్ట కిరణ్, ఎం.కిషోర్, నవీన్, నాగరాజు, కనకరాజు, హనుమంత్ పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

మురళీనగర్: గౌతమ బుద్ధుడు ప్రవచించిన శాంతి బోధనలు ప్రపంచానికి అనుసరణీయమని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కులోని బుద్ధుడి విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో పుట్టిన బౌద్ధ మతం ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు అనుసరిస్తున్నారని వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం మాట్లాడుతూ పనిని ధ్యానంగా చేసుకోవాలని, మన సంతోషం ఇతరుల సంతోషానికి కారణమవ్వాలని బుద్ధుడు ప్రబోధించినట్లు చెప్పారు. బుద్ధం శరణం గచ్ఛామి అనే ధ్యాన మంత్రాన్ని సభ్యులు పఠించారు. బుద్ధుడి విగ్రహ దాత, పూర్వ వాకర్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, పూర్వ అధ్యక్షుడు కె.ద్వారకానాథ్, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, ఆర్.నాగేశ్వరరావు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో..

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని బుద్ధుడి విగ్రహానికి పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఇతర సభ్యులు పూలమాలలు వేసి పూజించారు. పార్కు కార్యదర్శి పి.వి.సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పొందూరు సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు, చింతాడ రామారావు, లంకా వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ తెలిపారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒక రోజు జాతీయ సదస్సుఇం పాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకో టూరిజం ఆన్ బయోడైవర్సిటీ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారం పెరగడం పెను ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రణాళికాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర జీవులపై సైతం ప్రభావం చూపుతోందన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యుడు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం, పర్యవసనాలను వివరించారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావం జీడీపీపై ప్రభావం చూపుతుందన్నారు.

5 శాతం సేవలు ఉచితంగా అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని స్కానింగ్ కేంద్రాల్లో పేదలకు 5 శాతం సేవలు ఉచితంగా అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆ వివరాలు ఎప్పటికప్పుడు తమకు అందజేయాలన్నారు. సంబంధిత అధికారులతో పకడ్బందీగా డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. పురుషులతో సమానంగా స్త్రీల నిష్పత్తి పెంచాలని కోరారు. కేజీహెచ్ పిల్లల వైద్యుడు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ 5 శాతం ఉచిత స్కానింగ్ సేవలు అర్హులైన పేదలకు అందుతున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీశ్వరరావు, దిశ సీఐ జి.మల్లేశ్వరి, జీవీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఎన్జీవోలు సన్యాసిరాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.